# దొంగబుద్ధి

-ఎం.గాంధీ



గుళ్ళోనుండి బయటికొచ్చిన రాజానంద్ చెప్పులు తొడుక్కోబోతూ ఆగాడు. అక్కడ వున్న వందలాది చెప్పుల్లో ఎవరివో ఓ జత చెప్పులు చాలా బాగా వున్నాయి. అవి ఖరీదైనవి అని చెప్పకనే తెలుస్తోంది. వాటిని చూడగానే దొంగతనం చేయాలనుకున్నాడు. అక్కడి పరిస్థితిని గమనించాడు. పండుగ కావడంతో భక్తులతో గుడి అంతా చాలా హడావుడిగా వుంది.

రాజానంద్ చెప్పులు కూడా కొత్తవే. ఈ మధ్యే మూడు వందలు పెట్టి కొన్నాడు. కానీ అక్కడున్న చూడముచ్చటైన జత చెప్పుల ముందు తనవి దిగదుడుపే అని ఫీల్ అయ్యాడు. ఒకవేళ తను దొంగతనం చేస్తూ దొరికిపోతే ఎలా బుకాయించాలో మనసులోనే రిహార్సల్ వేసుకున్నాడు. ఏదైతే అది అవుతుంది అని తన చెప్పుల్ని వేసుకోకుండా ఆ ఖరీదైన చెప్పుల్ని వేసుకొని ఆదరాబదరా అక్కడ్నుంచి నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

గుడిదాటి ఒక ఫర్లాంగుదూరం వచ్చేశాడు రాజానంద్. తను చెప్పుల్ని దొంగతనం చేసిన విషయం ఎవరూ కనుక్కోకపోవడంతో లోలోన సంతోషపడ్డాడు. ఇంతలో తన ఫ్రెండొకడు ఎదురుపడి రాజానంద్ చెప్పుల్ని చూసి "నిన్న ఓ చెప్పుల షాపులో ఈ చెప్పుల్ని చూసి నేను కొందామనుకున్నానా! కానీ రెండు వేల రూపాయలని వద్దనుకున్నాను... ఈసారి డబ్బులొస్తే ఇలాంటివే కొంటాను" అన్నాడు.

తనవికాని తన చెప్పుల్ని పొగిడినందుకు ఆనందపడ్డాడు రాజానంద్. అతను ఓ టీస్టాల్‌లో టీ త్రాగుతుండగా అక్కడ ఓ ఇద్దరు వ్యక్తులు తన చెప్పులు బాగున్నాయి అని మాట్లాడుకోవడం కూడ విన్నాడు. తను దొంగతనం చేసిన చెప్పులు తనకే కాదు అందరికీ నచ్చాయనేసరికి రాజానంద్ చాలా సంతోషపడిపోయాడు.

అదేరోజు సాయంత్రం తన ఫ్రెండ్ బర్త్‌డే పార్టీ వుండడంతో అందరిముందు డాబుసరిగా వుంటుందని దొంగచెప్పుల్ని ధరించి వెళ్ళాడు రాజానంద్. బర్త్‌డే పార్టీకొచ్చిన వాళ్ళల్లో కొంతమంది అతని చెప్పుల్ని చూసి 'చాలా బాగున్నాయే?' అంటూ మెచ్చుకున్నారు. పరిచయం లేనివాళ్ళు కూడా అదే పనిగా చెప్పులకేసి చూశారు. ఇంతలో వర్షం మొదలవడంతో పార్టీకొచ్చిన వాళ్ళంతా లాన్‌లోంచి ఇంట్లోకి వెళ్ళాల్సి వచ్చింది. అలా వెళ్తూ అందరూ చెప్పుల్ని గడప బయటే వదిలి లోపలికి వెళ్తున్నారు. రాజానంద్ కూడా అలా చేయక తప్పలేదు. బర్త్‌డే పార్టీ అయ్యాక అందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. కొంతమంది తినకుండా వెళ్లిపోతే, మరికొంతమంది తినసాగేరు. రాజానంద్ కూడా తింటానికి ఉపక్రమించాడు. తన ఇంటివైపు వెళ్ళే స్కూటరున్న ఫ్రెండ్‌ని లిఫ్ట్ అడిగి అతను భోంచేసేవరకు వెయిట్ చేసి బయటకొచ్చి చూస్తే, గడప దగ్గర వదిలిన తన దొంగచెప్పులు కనబడలేదు. దాంతో, షాక్ తిన్నాడు రాజానంద్.

తన చెప్పుల్ని ఎవరో పొరపాటుగా వేసుకొని పోలేదు. ఇష్టపడి దొంగతనంగా తీసుకుని పోయినట్టు గ్రహించాడు రాజానంద్. అయినా ఆశ చంపుకోలేక దొరుకుతాయేమోనని వెతికాడు. ఎక్కడా కనబడలేదు. తన ఇంటివైపు వెళ్ళే ఫ్రెండ్ తొందరపెట్టడంతో చెప్పులు లేకుండానే బయల్దేరాడు రాజానంద్. చెప్పులు ఖరీదైనవి కావడంతో ఎవడికో తనలా దొంగిలించాలని దుర్బుద్ధి పుట్టింది. అదే తన స్వంత చెప్పులతో వచ్చుంటే వాటినెవరూ దొంగిలించేవారు కాదు. తన దొంగబుద్ధికి ఎవడో సరైన గుణపాఠం చెప్పాడు అని బాధపడుతూ ఇల్లు చేరుకున్నాడు రాజానంద్.

★